సిపిఎం జిల్లా విస్తృత సమావేశాలు వాయిదా

7, 8 తేదీల్లో తణుకులో నిర్వహణ

సిపిఎం జిల్లా కార్యదర్శి గోపాలన్

ప్రజాశక్తి - తణుకు

ఈ నెల 25, 26 తేదీల్లో జరిగే సిపిఎం జిల్లా విస్తృత సమావేశాలు ఆగస్టు 7, 8వ తేదీలకు వాయిదా పడిందని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్, కార్యదర్శి వర్గ సభ్యులు పివి.ప్రతాప్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కొన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా వేశామని తెలిపారు. ఈ సమావేశాలు తణుకు పట్టణంలో జరుగుతాయని తెలిపారు. ఈ సమావేశాల్లో రాష్ట్ర నాయకులు బి.బలరాం, వి.ఉమా మహేశ్వరరావు పాల్గొంటారని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, స్మార్ట్ మీటర్లు, రైతులు సమస్యలపై చర్చించి భవిష్యత్తు పోరాట కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు.

మట్టి ఖర్చుల మాటేంటి..!

- ప్రభుత్వ పెన్షనర్లు మరణిస్తే పట్టని ప్రభుత్వం
- ఒక్కొక్కరికీ రూ.25 వేలు చెల్లిస్తామని మొండిచెయ్యి
- జిల్లాలో నాలుగు నెలల్లో 164 మంది మృతి
- ఏప్రిల్ ఒకటి నుంచి నిలిచిన చెల్లింపులు
- ఎదురుచూస్తున్న పెన్షనర్ల కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి - భీమవరం

ప్రభుత్వ పెన్షనర్ల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఇప్పటికే అనేక సమస్యలతో సతమతమవుతున్న వారి పరిస్థితి ప్రస్తుతం మరింత దయనీయంగా మారింది. చనిపోయిన తర్వాత మట్టి ఖర్చులు ఇవ్వకుండా మొండిచెయ్యి చూపుతోంది. ఈ నాలుగు నెలల కాలంలో ఎంతోమంది పెన్షనర్లు మృతి చెందినప్పటికీ కుటుంబ సభ్యులకు చిల్లిగవ్వ కూడా ఇవ్వలేదు. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి చెల్లింపులు నిలుపుదల చేయడంతో పెన్షనర్ల కుటుంబ సభ్యులు మట్టి ఖర్చుల సొమ్ము కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు.

వివిధ విభాగాల్లో ఎంతోమంది ప్రభుత్వ ఉద్యోగులు పని చేస్తున్నారు. ఉద్యోగ కాలమంతా అనేక ఆటుపోట్లు ఎదుర్కొన్నా, ఉద్యోగ విరమణ తర్వాత కూడా ఇదే పరిస్థితి కొనసాగుతుండటం బాధాకరం. పెన్షనర్ మరణించిన తర్వాత కూడా వారి కుటుంబ సభ్యులకు సమస్యలు తప్పట్లేదు. ప్రభుత్వ పెన్షనర్లు మరణిస్తే మట్టి ఖర్చుల కింద ఒక్కొక్కరికీ రూ.పది వేలతోపాటు ఒక నెల పెన్షన్ ప్రభుత్వం అందించేది. తర్వాత దీన్ని రూ.15 వేలకు పెంచారు. వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత నెల పెన్షన్ ఇవ్వకుండా మట్టి ఖర్చుల కింద ఇచ్చే మొత్తాన్ని రూ.25 వేలకు పెంచింది. ఎవరైనా పెన్షనర్ మరణిస్తే ఆన్‌లైన్‌లో నమోదు చేసిన పది రోజుల్లో ఆ కుటుంబ సభ్యుల బ్యాంకు ఖాతాకు ట్రెజరీ అధికారులు సొమ్ము జమ చేసేవారు. గడిచిన నాలుగు నెలలుగా పెన్షనర్ మరణించినా మట్టి ఖర్చు సొమ్ము రావడం లేదు. ఈ ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఇప్పటి వరకూ 164 మంది వరకూ మృతి చెందారు. గతంలో ఎన్నడూ ఈ నిధుల విడుదలలో ఏ ప్రభుత్వమూ జాప్యం చేయలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన మొదట్లో నిధులు విడుదల చేసినప్పటికీ తర్వాత నిలుపుదల చేయడంతో పెన్షన్‌దారుల కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటివరకూ ట్రెజరీల వారీగా భీమవరంలో 41 మంది, తాడేపల్లిగూడెంలో 32, పాలకొల్లులో 25, తణుకులో 32, పెనుగొండలో 9, నరసాపురంలో 16, ఆకివీడులో 10 మంది వరకూ చనిపోయినట్లు లెక్కలు చెబుతున్నాయి. అయితే నెలలు తరబడి మట్టి ఖర్చు సొమ్ము ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో పెన్షన్‌దారుల కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం

చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రభుత్వం తీరు పట్ల విస్మయం వ్యక్తం చేస్తోంది.

మనోవేదన పట్టించుకోకపోవడం దారుణం

గాతల జేమ్స్, ఎపి ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు

ప్రభుత్వ రంగంలో దీర్ఘకాలం పని చేసి అనేక సేవలందించి ఉద్యోగ విరమణ తర్వాత సంబంధిత ఉద్యోగిని కనీసం ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. చనిపోయినా కూడా కనీసం ప్రభుత్వం నుంచి సాయం అందడం లేదు. పెన్షనర్ల కుటుంబ సభ్యుల మనోవేదనను ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణం. కుటుంబ సభ్యులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా మట్టి ఖర్చుల నిలుపుదల ఎంతవరకూ సమంజసం. ప్రభుత్వం, ప్రభుత్వ అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తా.

2018 నుంచి ఎరియర్స్ ఇవ్వట్లేదు

పి. సీతారామరాజు, ఎపి ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్, భీమవరం యూనిట్ కార్యదర్శి

2018 నుంచి ఎరియర్స్ ఇవ్వడం లేదు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ వేల మంది రిటైర్డ్ ఉద్యోగులు చనిపోయారు. ఎరియర్స్ ఇవ్వకపోవడం వల్ల చాలా నష్టపోయారు. చనిపోతే కనీసం మట్టి ఖర్చులు ఇవ్వకపోవడంతో పెన్షనర్ల పట్ల ప్రభుత్వానికి ఎంత శ్రద్ధ ఉందో అర్థమవుతోంది. ఏప్రిల్ నుంచి భీమవరం పరిధిలో 25 మంది వరకూ పెన్షనర్లు చనిపోయారు. వీరి కుటుంబాలు మట్టి ఖర్చుల సొమ్ము కోసం ఎదురుచూస్తున్నారు.

సమస్యలతో పెన్షనర్లు సతమతం

సాగిరాజు సత్యనారాయణరాజు, ఎపి ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి

ప్రస్తుతం ప్రభుత్వ ఉద్యోగం కత్తి మీద సాములా మారింది. ఇబ్బందులు అధిగమించి ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు. ఉద్యోగ విరమణ చేసిన తర్వాత కూడా పెన్షనర్లు అనేక సమస్యలతో సతమతమవుతున్నారు. ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. జిల్లాలో నాలుగు నెలల్లో ఎంతోమంది పెన్షనర్లు చనిపోయారు. వారికి ఇప్పటివరకు మట్టి ఖర్చులు ఇవ్వకపోవడం దారుణం.

8 నెలల నుంచి మట్టి ఖర్చులు ఇవ్వలేదు

సిహెచ్.వెంకటేశ్వరరావు, రాయకుదురు

నా తండ్రి ఆదినారాయణ ఉపాధ్యాయులుగా పనిచేశారు. గతేడాది డిసెంబర్ 26న మృతి చెందారు. అప్పట్లో మట్టి ఖర్చులకు డబ్బులు ఇస్తామన్నారు. ఇప్పటికి ఎనిమిది నెలలైనా సొమ్ము రాలేదు. ఏమైందో తెలీదు. అధికారుల చుట్టూ తిరిగి తిరిగి ఏం చేయాలో తెలియని పరిస్థితి. ప్రభుత్వ ఉద్యోగిగా అనేక సేవలందించినా సమస్యను మాత్రం ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా మట్టి ఖర్చులు జమ చేయాలని కోరుతున్నాం.

కోమటిగుంటను ఆదర్శంగా తీసుకోవాలి

డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు

ప్రజాశక్తి - కాళ్ల

ఆక్రమణలు తొలగించి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఏర్పాటు చేసిన కోమటిగుంట గ్రామాన్ని ఆదర్శంగా తీసుకోవాలని డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామ కృష్ణరాజు తెలిపారు. బుధవారం కోమటిగుంటలో ఆయన పలు అభివృద్ధి, శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించారు. పంచాయతీ నిధులు రూ.5 లక్షలు, కెనరా బ్యాంకు సిఎస్‌ఆర్ నిధులు రూ.5 లక్షలు మొత్తం రూ.10 లక్షలతో నిర్మించిన మైక్రో ఫిల్టర్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. గ్రామ సర్పంచి బోణం భాగ్యశ్రీ శివకుమార్ సొంత నిధులు రూ.5 లక్షలతో వాకింగ్ ట్రాక్, సేద తీరడానికి ఏర్పాటు చేసిన షెడ్డును ప్రారంభించారు. ఎంపీ నిధులు రూ.15 లక్షలతో నిర్మించనున్న కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం దుర్గాదేవి ఆలయ 5వ వార్షికోత్సవం సందర్భంగా రఘురామ కృష్ణరాజు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఎపిఐఐసి ఛైర్మన్ మంతెన రామరాజు, జనసేన ఉండి నియోజకవర్గ



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించి బిందెతో నీటిని మహిళకు అందిస్తున్న డిప్యూటీ స్పీకర్

ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు అమ్మవారిని దర్శించుకున్నారు. సర్పంచి బోణం భాగ్యశ్రీ శివకుమార్, ఉప సర్పంచి వేగిరెడ్డి లక్ష్మి, జనసేన మండల అధ్యక్షులు ఎరుబండి రామాంజనేయులు, మాజీ సర్పంచులు యలమంచిలి రామాంజనేయులు, యలమంచిలి వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి మంతెన నాగాంజనేయులు, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు కోరా రామ్మూర్తి, బిజెపి మండల అధ్యక్షులు పానకాల కృష్ణాంజనేయులు పాల్గొన్నారు.

పేదల ఆర్థికాభివృద్ధే పి4 లక్ష్యం

ప్రజాశక్తి - నరసాపురం

పేదల ఆర్థికాభివృద్ధి సాధించడమే పి4 ప్రధాన లక్ష్యమని పి4 కార్యక్రమ మండల ప్రత్యేకాధికారి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు అన్నారు. చిట్టవరం గ్రామ సచివాలయంలో గురువారం నిర్వహించిన పి4 గ్రామ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా బంగారు కుటుంబాలను ఎంపిక చేసి దాతల సహకారంతో వారిని దత్తత తీసుకునే విధంగా గ్రామ పి4 సిబ్బంది, గ్రామ స్థాయి అధికారులు చూడాలన్నారు. ఇందుకు సంబంధించి బంగారు కుటుంబాల గుర్తింపును ఆగస్టు 15వ తేదీ నాటికి పూర్తి చేయాలన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో పి4 సర్వేలో గుర్తించిన

మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వరరావు

అర్హులైన 25 కుటుంబాల వివరాలను గ్రామ సభలో చదివి వినిపించారు. అర్హులైన బంగారు కుటుంబాలు ఇంకా ఉంటే గుర్తించి నమోదు చేయాలన్నారు. బంగారు కుటుంబాల గుర్తింపుపై అభ్యంతరాలుంటే తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ జివిఎస్.రామకృష్ణంరాజు, మండల వ్యవసాయ అధికారి ఎ.జ్యోషిల, సర్పంచి తాడి లక్ష్మణరావు, గ్రామ కార్యదర్శి కె.పుల్లాజీ పాల్గొన్నారు.

గోదా'వర్రీ'..!

- అల్పపీడన ప్రభావంతో జోరుగా వర్షాలు
- మరోసారి గోదావరికి వరద
- పోలవరం స్పిల్‌వే వద్ద 28 మీటర్లకు చేరిన నీటిమట్టం
- దిగువకు రెండు లక్షల క్యూసెక్కులకుపైగా నీరు విడుదల
- కుక్కునూరు, వేలేరుపాడు మండలాల ప్రజల్లో ఆందోళన

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో జోరుగా వర్షాలు కురుస్తున్నాయి. వర్షాల జోరు ఒకపక్క, ఎగువ నుంచి వస్తున్న వరదపోటుతో గోదావరికి వరద ఉధృతి రోజురోజుకీ పెరుగుతోంది. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 20 అడుగులు దాటేసింది. పోలవరం స్పిల్‌వే వద్ద నీటిమట్టం 28 మీటర్లకు చేరింది. దీంతో రెండు లక్షల క్యూసెక్కులకుపైగా నీటిని సముద్రంలోకి విడిచిపెడుతున్నారు. గోదావరికి వరద పోటు పెరుగుతుండటంతో ముంపు మండలాలైన కుక్కునూరు, వేలేరుపాడుల్లోని ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఈ నెల మొదటివారంలో గోదావరికి పెద్దఎత్తున వరద వచ్చింది. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 41 అడుగులకు చేరింది. 43 అడుగులకు చేరితే మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారు. వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లోని గొమ్ముగూడెం, రేపాకగొమ్మి వంటి పలు గ్రామాలకు చెందిన ప్రజలను పునరావాస కాలనీలకు తరలించారు. మరికొన్ని గ్రామాల ప్రజలు చల్లావారిగూడెంలోని కాలనీలోకి తరలివెళ్లారు. ఇంతలో గోదావరి తగ్గుముఖం పట్టడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. పునరావాస కాలనీలకు తరలివెళ్లిన జనం తిరిగి ఊళ్లకు చేరుకోగా, కొంతమంది అక్కడే ఉండిపోయారు. ఇక గోదావరి వరద భయం తప్పినట్టే అనుకుంటున్న తరుణంలో మళ్లీ వరద ఉధృతి పెరుగుతోంది. ఎగువ నుంచి భారీగా నీరు

వస్తుండటంతో గోదావరికి వరద ముప్పు పొంచి ఉంది. దీంతో నిర్వాసిత గ్రామాల్లో తీవ్ర ఆందోళన నెలకొంది.

ప్రభుత్వ తప్పిదాలకు నిర్వాసితుల అవస్థలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తప్పిదాలకు పోలవరం నిర్వాసితులు నరకయాతన అనుభవిస్తున్నారు. ప్రతియేటా జులై, ఆగస్టుల్లో వచ్చే వరదలకు కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని వందకుపైగా గ్రామాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 30 అడుగులు దాటేసరికి గుండేటి వాగుపై కాజ్‌వే, ఎద్దువాగుపై కాజ్‌వే నీటమునిగి వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లోని దాదాపు 35కుపైగా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. గొమ్ముగూడెం, రాపాకగొమ్మి, రుద్రంకోట, కొయిదా వంటి అనేక గ్రామాల ప్రజలు పునరావాస కాలనీలకు, కొండలు, గుట్టలపైకి తరలిపోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. 41.15 కాంటూరు పరిధిలో ముంపు గ్రామాలకు పూర్తిస్థాయిలో పరిహారం ఇస్తామని ప్రభుత్వం ప్రకటించినా చేయలేదు. నిర్వాసిత కాలనీల్లో ఇంటి నిర్మాణాలు పూర్తి కాలేదు. ఇంటి స్ట్రక్చర్ వాల్యూయేషన్‌కు సంబంధించిన సొమ్ము ఇవ్వలేదు. 18 ఏళ్లు నిండిన యువతకు పరిహారం అందించలేదు. పరిహారం పూర్తిస్థాయిలో ఇవ్వకుండా బలవంతంగా నిర్వాసితులను పంపించే ఆలోచనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్నట్లు కన్పిస్తోంది. 45.72 కాంటూరు పరిధిలో ఉన్న గ్రామాలు సైతం ఓ మోస్తరు వరదకే మునిగిపోతున్నాయి. కాంటూరు లెక్కల్లో తప్పిదాల కారణంగా ఇటువంటి పరిస్థితి ఏర్పడింది. తమ గ్రామాలను 41.15 కాంటూరు పరిధిలో చేర్చి తొలిదశలో ఖాళీ చేయించే గ్రామాల్లో చేర్చాలని అనేక గ్రామాలు కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. దీంతో ప్రతియేటా గోదావరి వరదలకు నిర్వాసితులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. మరోసారి గోదావరికి వరద పెరుగుతుండటంతో ముంపు గ్రామాల నిర్వాసితులు భయంభయంగా కాలం వెళ్లదీస్తున్నారు.

మంత్రి నిమ్మలపై దాడి కేసు సిఐడికి అప్పగింత

లోతుగా దర్యాప్తు చేయాలని ఆదేశాలు

ప్రజాశక్తి - పాలకొల్లు

గత వైసిపి ప్రభుత్వంలో మంత్రి నిమ్మల రామానాయుడుపై జరిగిన దాడికి సంబంధించి కేసును సిఐడికి అప్పగించారు. అప్పట్లో దాడి ఘటనపై పాలకొల్లు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా, వైసిపి ప్రమేయంతో కేసు నమోదు చేయలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే 2022లో చేసిన ఫిర్యాదు మేరకు కేసుగా నమోదు చేశారు. నరసాపురం డిఎస్‌పి విచారణ నేపథ్యంలో తాజాగా దీనిపై లోతుగా దర్యాప్తు జరిపేందుకు సిఐడికి బదలాయిస్తూ డిజిపి ఉత్తర్వులు జారీ చేశారు. విజయవాడ సిఐడి డిఎస్‌పి మోహన్ నేతృత్వంలో అయిదుగురు సభ్యులతో కూడిన సిట్‌ను ఏర్పాటు చేశారు.

వివరాల్లోకి వెళ్తే.. 2022లో వైసిపి ప్రభుత్వ హయాంలో పాలకొల్లు పట్టణంలోని టిడ్కో గృహాల కాలనీ వద్ద ఇళ్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. అప్పటి మంత్రులు ఆదిమూలం సురేష్, కారుమూరి నాగేశ్వరరావు, కొట్టు సత్యన్నారాయణ, అప్పటి నర్సాపురం ఎంఎల్‌ఎ ముదునూరి ప్రసాదరాజు పాల్గొన్నారు. ప్రొటోకాల్ ప్రకారం ఇళ్ల పంపిణీ సభకు ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు అధ్యక్షత వహించాల్సి ఉంది. అయితే అధికారుల పిలుపు మేరకు ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు, అప్పటి ఎంఎల్‌సి అంగర రామ్మోహన్ వేదికపైకి ఎక్కుతుండగా ప్రొటోకాల్ లేకుండా సభావేదికకు సంబంధం లేని వైసిపి కార్యకర్తలు, మరి కొంతమంది కిరాయి మూకలు వారిని వేధికపైకి రాకుండా నిరోధించి వారిపై భౌతిక దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో నిమ్మల రామానాయుడుకు రక్షణగా నిలిచిన వారిపై కూడా భౌతిక దాడికి పాల్పడ్డారు. దీనిపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో, డిజిపి, డిఐజి, ఎస్‌పి, కలెక్టర్‌కు రామానాయుడు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోలేదు. అప్పట్లో ప్రతిపక్షనేతగా ఉన్న చంద్రబాబు నాయుడు సైతం డిజిపికి ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయకపోగా, తిరిగి ఎదురు కేసులు నమోదు చేసి కోర్టుల చుట్టూ తిప్పుతున్నారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అప్పటి ఫిర్యాదుపై కేసు నమోదు చేసి నర్సాపురం డిఎస్‌పి శ్రీవేద విచారణ చేపట్టారు. పథకం ప్రకారం నిమ్మల రామానాయుడుపై దాడికి పాల్పడ్డారని, ఆ సమయంలో దాడిచేసిన వ్యక్తులు మారణాయుధాలు ధరించారని, విచారణలో సాక్షులు పేర్కొన్నారు. ఈ కేసుపై లోతైన దర్యాప్తు జరపాలని, సిఐడి ఆధ్వర్యంలో సిట్ ఏర్పాటు చేస్తూ సిఐడి డిజిపి ఆదేశాలు జారీచేశారు.

స్మార్ట్ మీటర్ల బిగింపు ఆపాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ప్రజలకు షాక్ కొట్టే అదానీ విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపు ఆపాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి గోపాలన్ డిమాండ్ చేశారు. సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో గురువారం నాలుగో రోజు ఇంటింటికీ కరపత్రాలు పంచుతూ జువ్వలపాలెం, శివాలయంవీధిలో ప్రచార ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విద్యుత్ సంస్కరణలో భాగంగా కూటమి ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు బిగించాలని ఆలోచన చేస్తోందని, దీన్ని సిపిఎం తీవ్రంగా వ్యతిరేకిస్తోందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రస్తుతం రెండు కోట్ల విద్యుత్ కనెక్షన్లు ఉండగా వాటి స్థానంలో స్మార్ట్ మీటర్లు బిగించాలని కూటమి ప్రభుత్వం చూస్తోందని విమర్శించారు. ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాలకు, వ్యాపార సంస్థలకు, షాపులకు స్మార్ట్ మీటర్లు బిగించారని, బిగించిన తరువాత కరెంట్ బిల్లులు షాక్ కొట్టేలా ఉన్నాయని ప్రజలు గగ్గోలు

ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేస్తున్న జెఎన్‌వి గోపాలన్

పెడుతున్నారని తెలిపారు. సిపిఎం నిరంతరం ప్రజల కోసం నిజాయతీగా పోరాటాలు చేస్తోందన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లు పగలగొట్టాలని పిలుపు ఇచ్చిన మంత్రి లోకేష్ అధికారంలోకి వచ్చిన తర్వాత స్మార్ట్ మీటర్ల పేరుతో భారాలు మోపడాన్ని సిపిఎం తీవ్రంగా ఖండిస్తోందన్నారు. గతంలో చెత్తపన్ను చెల్లించకుండా సిపిఎం పెద్ద ఎత్తున పోరాటాలు చేసిందని గుర్తుచేశారు. ఇప్పుడు స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా పోరాడుదామని పట్టణ ప్రజలకు పిలుపునిచ్చారు. స్మార్ట్ మీటర్ల బిగింపు ఆపకపోతే దశలవారీ ఆందోళనలు చేపట్టి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు బుద్ధి చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కర్రి నాగేశ్వరరావు, పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ, సిద్ధిరెడ్డి శేషుబాబు, పోతు శ్రీను, అన్నం చిన్నారావు, కన్నంరెడ్డి శివాజీ, దత్తు రాము, నగిరెడ్డి సాయి, చవల శాంతిరాజు, గోకా బుజ్జి, పడాల నాగేశ్వరరావు, పిట్టా రాంబాబు, బర్ల బాలాజీ, తోట శ్రీను, పూడి బాలాజీ, బొడ్డపాటి శివ, యడ్ల శ్రీను, కె.ఉదయ్‌కుమార్, వి.అప్పారావు, పి.నాగేంద్రబాబు పాల్గొన్నారు..

స్మార్ట్ మీటర్లతో నష్టం లేకుంటే..

ప్రజాభిప్రాయాన్ని సేకరించండి : గోపాలన్

ప్రజాశక్తి - భీమవరం

స్మార్ట్ మీటర్ల వల్ల నష్టం లేకపోతే ప్రజల్లోకి వచ్చి ప్రజాభిప్రాయ సేకరణ చేయాలని, బలవంతంగా స్మార్ట్ మీటర్లు బిగించడం దేనికని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ ప్రశ్నించారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. స్మార్ట్ మీటర్ల బిగింపుపై ఎటువంటి అపోహలు అవసరం లేదని, వినియోగదారులపై అదనపు ఛార్జీల భారం ఉండదని ఎపి ఇపిడిసిఎల్ ఎస్‌ఇ రఘునాథబాబు ప్రకటించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఇప్పటికే బలవంతంగా బిగించిన స్మార్ట్ మీటర్ల వల్ల అదనపు ఛార్జీలు రావడంతో అనేక సంస్థలు, వ్యాపారదారులు, ప్రజలు గగ్గోలు పెడుతున్నారని తెలిపారు. స్మార్ట్ మీటర్ల బిగింపు యుద్ధ ప్రాతిపదికన ఎవరి లాభం కోసం చేస్తున్నారని ప్రశ్నించారు. ఇప్పటికే ట్రూఅప్ ఛార్జీలు, ఇతర ఛార్జీలతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. స్మార్ట్ మీటర్లు బిగించిన కొంతకాలానికి ప్రీపెయిడ్ రీఛార్జ్ చేసుకొనేలా మారుస్తారనేది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. వినియోగదారులతో సమావేశం వేసి ప్రజల అపోహలను నివృత్తి చేయాలని ఎపి ఇపిడిసిఎల్ అధికారులకు సూచించారు. అదానీ కంపెనీ రాష్ట్రంలోని రెండు కోట్ల మంది వినియోగదారులకు పాత మీటర్లు తొలగించి, స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. సెల్ ఫోన్ తరహాలో ఇకనుంచి ముందుగానే డబ్బు చెల్లించి కరెంటు కూడా రీఛార్జి చేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఈ పద్ధతి వల్ల బడా కంపెనీలు దేశంలో రూ.23 లక్షల కోట్లు అడ్వాన్స్ రూపంలో జనం నుండి గుంజుతారని తెలిపారు. ప్రజలందరూ విద్యుత్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు.

రాంబాబుపై చర్యలు తీసుకోవాలి

- ఇసుక అక్రమ నిల్వలను సీజ్ చేయాలి
- తహశీల్దార్‌కు సర్పంచుల వినతి



డిప్యూటీ తహశీల్దార్ సోమేశ్వరరావుకు వినతిపత్రం అందజేస్తున్న వైసిపి సర్పంచులు

ప్రజాశక్తి - ఆచంట

నియోజకవర్గంలో ఇసుక మాఫియా డాన్ అయిన పోడూరు మండలం పండిత విల్లూరు గ్రామానికి చెందిన టిడిపి నాయకులు గణపతినీడి రాంబాబు అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక గుట్టలను తక్షణం సీజ్ చేయాలని నియోజకవర్గ సర్పంచులు సుంకర సీతారామ్, ఇళ్ల లక్ష్మీచంద్రిక, జక్కంశెట్టి శ్రీరామ్, కోట సరోజినీ వెంకటేశ్వరరావు, గణేషుల శేషవేణి సుబ్బారావు, గుబ్బల ఉషారాణి, వీర బ్రహ్మం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పలువురు సర్పంచులు మాట్లాడుతూ గ్రీన్ ట్రిబ్యునల్ పరిధిలో 50కిలో మీటర్ల వరకూ ఇసుక తీయకూడదని, అయినా ఏ విధమైన అనుమతులూ లేకుండానే వంద యంత్రాలతో వేల సంఖ్యలో లారీలతో అక్రమంగా ఇసుక తరలించుకుపోయారని విమర్శించారు. నియోజకవర్గంలో ఖాళీ ప్రదేశాలు ఎక్కడ ఉన్న అక్రమంగా ఇసుక గుట్టలు నిల్వ చేశారన్నారు. ఉచితంగా ఇసుక అందిస్తామని ప్రభుత్వం చెబుతున్నా, గణపతినీడి రాంబాబు వంటి ఇసుక మాఫియా డాన్‌లు చెలరేగిపోతున్నారని విమర్శించారు. ఆయనపై చర్యలు తీసుకోవాలి డిమాండ్ చేశారు. కొడమంచిలి, సిద్ధాంతంలో ప్రభుత్వ ఇసుక స్టాక్ పాయింట్‌లో అనుమతులులేని కోడేరు, కరుగోరుమిల్లి, భీమలాపురం, నడిపూడి, సిద్ధాంతం ర్యాంపుల నుంచి ఇసుకను అక్రమంగా తరలించి స్టాక్ పాయింట్‌లలో నిల్వ చేశారని తెలిపారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ ఎ.సోమేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గెద్దాడ ఏకలవ్య, మెడిచర్ల పండు, గొట్టుముక్కల సునీల్ వర్మ, ఇళ్ల శ్రీనివాస్, పెచ్చెట్టి సత్యనారాయణ, కుక్కల కిరణ్, బొరుసు రాంబాబు, కోట గిరిధర్, షేక్ ఖాసి, కేతా తాతారావు, నక్కా ప్రేమ్ కుమార్, గంటి బాబూరావు, నక్కా మహేష్ చదలవాడ ముత్యాలరావు, ప్రసాద్ పాల్గొన్నారు.

రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

పాలకొల్లులో భారీ వర్షం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లులో 3 రోజులుగా తేలికపాటి వర్షం పడుతున్న నేపథ్యంలో గురువారం మధ్యాహ్నం భారీ వర్షం పడింది. ఉదయం నుంచి తేలికపాటి వర్షం పడినా మధ్నాహానికి ఎక్కువైంది. దీనికితోడు చలిగాలులు వీచాయి. ఆషాడ మాసం వెళుతూ శ్రావణ మాసం వస్తున్న శుభవేళ పలు వివాహాది శుభకార్యాలు జరగడానికి బట్టల దుకాణాలకు వచ్చిన మహిళలు వర్షానికి ఇబ్బందులు పడ్డారు.

గ్రామాలన్నింటికీ శుద్ధి జలాలు

అభివృద్ధి పనులకు విప్ నాయకర్ శంకుస్థాపన

ప్రజాశక్తి - మొగల్తూరు

గ్రామాల్లో ప్రతి ఇంటికీ శుద్ధి జలాలు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని విప్ బొమ్మిడి నాయకర్ తెలిపారు. మండలంలోని కెపి.పాలెంనార్త్‌లో జల జీవన్ మిషన్ పథకంలో భాగంగా రూ.35 లక్షల నిధులతో తాగునీటి అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం మేరకు గ్రామాలన్నింటికీ శుద్ధిజాలాలు అందిస్తుందన్నారు. తాగునీటి సమస్యలున్న ప్రాంతాల్లో

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న విప్ నాయకర్

ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి కడలి సోంబాబు, ఎంపిడిఒ సిహెచ్.త్రిశూలపాణి, తహశీల్దార్ కె.రాజకిషోర్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఐరన్ మాత్రలతో రక్తహీనత నివారణ

హెచ్ఎం సిహెచ్.కృష్ణ

ప్రజాశక్తి - గణపవరం

కాశిపాడు మండల పరిషత్ పాఠశాలలో గురువారం రాష్ట్రీయ బాల స్వస్థ్లో భాగంగా విద్యార్థులకు ఐరన్ మాత్రలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పాఠశాల హెచ్ఎం సిహెచ్.కృష్ణ మాట్లాడుతూ ఆరోగ్యశాఖ ద్వారా విద్యార్థులకు ప్రతి గురువారం ఐరన్ మాత్రలు అందిస్తున్నట్లు చెప్పారు. ఐరన్ మాత్రలు వాడటం వల్ల విద్యార్థులకు రక్తహీనత నివారించవచ్చునని చెప్పారు. దీనివల్ల పిల్లలు చురుకుగా ఉంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్వతి ప్రసాద్, శ్రీనివాస్, ఆశాలు కృష్ణకుమారి, వరలక్ష్మీ పాల్గొన్నారు.

ఎంఎల్ఎ బొలిశెట్టి సాయం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ప్రజల కష్టాల్లో తాను వెన్నంటే ఉంటానని మరోసారి ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ తన దాతృత్వాన్ని చాటుకున్నారు. మండలంలోని మారంపల్లి గ్రామానికి చెందిన జన సైనికుడు కూరాకుల వెంకటేశ్వరరావు అనారోగ్యంతో ఇటీవల మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ గురువారం ఆ కుటుంబాన్ని పరామర్శించి తక్షణ సాయం కింద రూ.10 వేలు అందించారు. ఆ కుటుంబానికి ఎప్పుడు ఏఅవసరం వచ్చినా తానున్నానని భరోసా ఇచ్చారు. అదేవిధంగా స్థానిక 1వ వార్డ్కి చెందిన అర్చన త్రిమూర్తులు కాలు ఆపరేషన్కి డబ్బులు లేని స్థితిలో తన సోదరి శ్రీదుర్గ ఎంఎల్ఎ దృష్టికి తీసుకెళ్లగా తక్షణ సాయం కింద రూ.5 వేల ఆర్థిక సహాయం చేసి, త్రిమూర్తులకు మెరుగైన చికిత్స కోసం సంబంధిత డాక్టర్తో మాట్లాడి అవసరమైతే ఆపరేషన్ చేయాలని డాక్టర్ని కోరారు. తన వద్దకు వచ్చిన పేదలకు లేదు అనకుండా తన సొంత రూపాయలతో ఆర్థిక సహాయం అందిస్తున్న ఎంఎల్ఎను పలురు అభినందిస్తున్నారు.

పంట బీమాపై అవగాహన కల్పించాలి

ఎడిఎ డాక్టర్ పి.మురళీకృష్ణ

ప్రజాశక్తి - ఆచంట

పంటల బీమాపై రైతులకు అవగాహన కల్పించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని పాలకొల్లు ఎడిఎ డాక్టర్ పి.మురళీకృష్ణ అన్నారు. గురువారం ఆచంటలో రైతు సేవ ఇన్ఛార్జిలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మన జిల్లాలో వర్షాలు విస్తారంగా కురుస్తున్న నేపథ్యంలో రైతులందరూ త్వరితగతిన నాట్లు పూర్తి చేయాలని కోరారు. వరినాట్లపై విచక్షణారహితంగా ఎరువులు, పురుగుల మందులు వాడకూడదన్నారు. రైతులందరూ ప్రధానమంత్రి ఫసలి బీమా(పంటల బీమా)లో ఆగస్టు 15లోగా నమోదు కావాలని కోరారు. ఈ పంట నమోదు ప్రారంభమైన నేపథ్యంలో రైతులందరూ తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని వివరించారు. ఈ సమావేశంలో వ్యవసాయాధికారి బి.నాగరాజు, విస్తరణ అధికారి జి.నరేష్, రైతు సేవా కేంద్రం ఇన్ఛార్జిలు పాల్గొన్నారు.

అభినయ సరస్వతి పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - ఆచంట

కీర్తిశేషులు మహానటిమణి, అభినయ సరస్వతి, పద్మశ్రీ, పద్మభూషణ్ బి.సరోజాదేవిపై ఆచంట గ్రామానికి చెందిన వైసిపి రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్ కుమార్ రచించిన 'అభినయ సరస్వతి సరోజాదేవి' సినీ గ్రంథాన్ని బెంగళూరులోని మల్లేశ్వరంలో ఉన్న సరోజాదేవి స్వగృహంలో ఆమె కుమార్తె ఇందిరా పరమేశ్వరి చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఇందిరా పరమేశ్వరి మాట్లాడుతూ అమ్మపై అభిమానంతో ఆమె సినీ జీవిత విశేషాలతో ఇంతమంచి పుస్తకం తీసుకురావడం సంతోషకర విషయమని అన్నారు. గ్రంథ రచయిత వైట్ల కిషోర్ కుమార్ని ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో విజయకుమార్ రెడ్డి, జె.సూర్యకిరణ్, ఆమె కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

జనసేన స్తూపంపై దాడి

మాకు సంబంధం లేదు : వైసిపి

ఆచంట : పెనుమంచిలి గ్రామంలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో అధికార పార్టీ నిర్వహించిన బైక్ ర్యాలీలో జనసేన స్తూపంపై జరిగిన దాడికి, స్థానిక వైసిపి నాయకులకు ఎటువంటి సంబంధం లేదని వైసిపి నాయకులు గణేషుల సుబ్బారావు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆచంట పోలీస్ స్టేషన్లో గురువారం ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పెనుమంచిలి గ్రామంలో జనసేన స్తూపంపై జరిగిన దాడికి, వైసిపికి సంబంధం ఉందని జనసేన మండల అధ్యక్షులు జవ్వాది బాలాజీ ఆరోపించడాన్ని తీవ్రంగా ఖండించారు. కులాల మధ్యలో, పార్టీల మధ్య గొడవలు సృష్టించే విధంగా కొంతమంది వ్యవహరించడం దారుణమన్నారు. టిడిపి, జనసేన మధ్యలో ఉన్న చిచ్చుకు, వైసిపికి ఎటువంటి సంబంధం లేదని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు నక్కా ప్రేమ్ కుమార్, నక్కా మహేష్, గంటి బాబురావు పాల్గొన్నారు.

రైతుకు ఎపి మార్క్ఫెడ్ మోపెడ్ బహుమతి

ప్రజాశక్తి - పెనుమంట్ర


బహుమతి అందుకుంటున్న రైతు రత్తయ్య

మండలంలోని మల్లిపూడి గ్రామానికి చెందిన రుద్రుల రత్తయ్య అనే రైతుకు ఎపి మార్క్ ఫెడ్ వారు తీసిన లక్కీ డ్రాలో టివిఎస్ మోపెడ్ బండి బహుమతిగా లభించింది. స్థానిక మండల వ్యవసాయ శాఖ ఇన్ఛార్జి అధికారిణి బి.దేవీ సిరూప గురువారం ఇక్కడ తెలిపారు. ఈ సంబరాల పేరిట కోరమండల్ ఎరువుల కంపెనీ గతంలో తమ సంస్థలో ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు కూపన్లు ఇవ్వగా బుధవారం తీసిన డ్రాలో గెలుపొందిన రైతు రత్తయ్యకు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్ వెంకటేశ్వరరావు, ఇతర అధికారులు మోపెడ్ బండి అందజేశారని ఆమె పేర్కొన్నారు. బహుమతి పొందిన రైతును స్థానిక తహశీల్దార్ వై.రవికుమార్, ఎంపిడిఒ ఎంఎస్.ప్రభాకర రావు, వ్యవసాయ శాఖ సిబ్బంది అభినందించారు.

పలువురికి కళా, సేవా రంగ అవార్డులు

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లుకు చెందిన పలువురికి కోడి రామకృష్ణ కళా, సేవారంగ అవార్డులు వరించాయి. హైదరాబాద్ ఎవిఎ.ప్రసాద్ ల్యాబ్లో బుధవారం రాత్రి ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగిన అవార్డుల ప్రధానోత్సవంలో సినీ నిర్మాత తుమ్మలపల్లి రామ సత్యనారాయణ ఆధ్వర్యాన ఆత్మీయ చిత్ర దర్శకుడు కోడి రామకృష్ణ జయంతి సందర్భంగా ఈ అవార్డులు అందజేశారు. తెలుగు సరస్వత పరిషత్ జాతీయ అధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్, రంగస్థల నటులు, గుడాల హరిబాబు, శ్రీపద్మదేవరావు సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, యర్రంశెట్టి వెంకటేశ్వరరావు, రక్తదాన సుప్రీమ్ ప్రతాప ధనరీ సూర్య ప్రకాశ్ అవార్డులు అందుకున్న వారిలో ఉన్నారు. మాజీ ఎంపి మురళీమోహన్, సినీ దర్శకులు రేలంగి నరసింహారావు, సినీ హీరోలు సుమన్, అల్లరి నరేష్, అందాల నటి కవిత, సినీ నిర్మాత కొణిదెల నిహారిక ముఖ్య అతిథులుగా హాజరై అవార్డులు అందజేశారు. కళ, సేవా అవార్డులు అందుకున్న వారిని మంత్రి నిమ్మల రామానాయుడు, మాజీ ఎంపిపి మేడిశెట్టి సత్యనారాయణ, మాజీ ఎంపి చేగొండి హరిరామ జోగయ్య, డాక్టర్ కేశరాజు రామప్రసాద్, ఆకుమర్తి బాబురావు, రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ సుధీర్, కొంతేటి శాంతారావు, మానేపురం సత్యనారాయణ, మేడికొండ శ్రీనివాసరావు, చౌదరి, తాలాబత్తుల వెంకటేశ్వరరావు, వంగా నరసింహారావు అభినందించారు.

శిక్షణ తరగతులను వినియోగించుకోవాలి

జిల్లా కార్పెంటర్ అసోసియేషన్ అధ్యక్షులు చిట్టిబోజు భోగేశ్వరరావు

ప్రజాశక్తి - మొగల్తూరు

ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న స్కిల్ డెవలప్మెంట్ శిక్షణ తరగతులను కార్పెంటర్లు సద్వినియోగం చేసుకుని నైపుణ్యత సాధించాలని జిల్లా కార్పెంటర్ అసోసియేషన్ అధ్యక్షులు చిట్టిబోజు భోగేశ్వరరావు అన్నారు. గురువారం మొగల్తూరు గ్రామంలో వన మల్లీశ్వర స్వామి ఆలయం ఆవరణలో శ్రీ విశ్వకర్మ కుటుంబాలు, మొగల్తూరు గౌరీ శంకర్ కార్పొరేటర్ యూనియన్ అధ్యక్షులు చింతోజు పాండు రంగ ఆచారి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కార్పెంటర్లకు స్కిల్ డెవలప్మెంట్ శిక్షణ తరగతులను నిర్వహించి అనంతరం మిషనరీని ఉచితంగా అందించనున్నారని అన్నారు. త్వరలో భీమవరం పట్టణంలో శిక్షణ తరగతుల కేంద్రం ఏర్పాటు చేయనున్నారన్నారు. జిల్లా ఉపాధ్యక్షులు చింతారు పాండురంగ ఆచారి మాట్లాడారు. పలువురు పేదలకు బియ్యం, రూ.200 నగదు అందజేశారు. ఈ సమావేశంలో సంఘ జిల్లా ఉపాధ్యక్షులు మునగాల ప్రసాద్, కార్యదర్శి చిప్పాడ చంద్రశేఖర్, గౌరీ సంఘం అధ్యక్షులు గోడి నాగబాబు, అధికార ప్రతినిధి కర్రివాడ సత్యం, నరవ గోపాలకృష్ణ, జిల్లా కార్యదర్శి సభ్యులు గానాల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

సేవాస్ఫూర్తికి నిలువెత్తు రూపం అచ్యుతానందన్

సంతాప సభలో సిపిఎం నేతలు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

సేవాస్ఫూర్తికి నిలువెత్తు రూపం అచ్యుతానందన్ అని పలువురు కొనియాడారు. వెంప గ్రామంలోని బస్టాండ్ సెంటర్లో శుక్రవారం సిపిఎం ఆధ్వర్యాన కేరళ మాజీ ముఖ్యమంత్రి విఎస్.అచ్యుతానందన్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పిస్తూ సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఇంజేటి శ్రీనివాస్ మాట్లాడుతూ కార్మికులు, మహిళలు సమాజంలో అట్టడుగు వారి అభ్యున్నతి కోసం జీవితాంతం అవిశ్రాంతంగా పాటుపడిన పోరాటయోధుడని కొనియాడారు. ప్రజా, సేవాస్ఫూర్తికి ఆయన నిలువెత్తు రూపమని అన్నారు. ఈ కార్యక్రమంలో శాఖ సభ్యులు తోటి శుభకరం, వేగి ప్రసాద్ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెంలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి జెఎన్వి.గోపాలన్

తాడేపల్లిగూడెం టౌన్ : పోరాట యోధుడు, సమర్థ నేత, సిపిఎం అగ్రనేత విఎస్.అచ్యుతానందన్ మృతికి తాడేపల్లిగూడెం రైల్వే గూడ్స్ షెడ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన నివాళులర్పించారు. సత్తి కోదండరామిరెడ్డి అధ్యక్షతన గురువారం సంతాప సభ నిర్వహించారు. ఈ సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్వి.గోపాలన్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కర్రి నాగేశ్వరావు, గూడ్స్ షెడ్ ప్రధాన కార్యదర్శి చిర్ల పుల్లారెడ్డి పాల్గొని మాట్లాడారు. అచ్యుతానందన్ ప్రజా జీవితం చాలా గొప్పదని, ఆయన కేరళలో అసెంబ్లీకి ఏడుసార్లు ఎన్నికయ్యారని, 2006 నుంచి 2011 వరకు ముఖ్యమంత్రిగా ఉన్నారని, ముఖ్యమంత్రిగా శ్రమజీవుల సంక్షేమం కోసం అనేక చట్టపరమైన, పాలనాపరమైన చర్యలు తీసుకున్నారని చెప్పారు. ఆయన ప్రజా జీవితంలో ఎనిమిది దశాబ్దాలున్నారని, ప్రతి దశలోనూ ప్రజాపక్షం వహించారని చెప్పారు. ఆయన ఆదర్శాలను పాటిస్తూ పార్టీని ముందుకు తీసుకెళ్లడమే నిజమైన నివాళులు అని చెప్పారు. ఈ సంతాప సభలో కర్రి సాయి రెడ్డి, కర్రి శ్రీనివాస్ రెడ్డి, తేతల నాగిరెడ్డి, బుద్ధాల నాని, ఆకుల నారాయణ, ఎస్సిఎస్ రెడ్డి, గాది వెంకట్రావు, మద్దాల పుత్రయ్య, ఆంజనేయులు, అడ్డగర్ల కృష్ణ, గుడిమెట్ల నాగబాబు, సత్య దుర్గారెడ్డి పాల్గొన్నారు.


ఆకివీడులో అచ్యుతానందన్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నేతలు

ఆకివీడు : కేరళ మాజీ ముఖ్యమంత్రి, కమ్యూనిస్టు యోధుడు విఎస్ అచ్యుతానందన్ మృతికి సిపిఎం కార్యకర్తలు నివాళి ఘటించారు. గురువారం స్థానిక సిపిఎం కార్యాలయంలో అచ్యుతానందన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏరియా కార్యదర్శి కె.తవిటి నాయుడు మాట్లాడుతూ భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణంలో ప్రముఖ పాత్ర పోషించిన అచ్యుతానందన్ జీవితం ఆదర్శనీయమని కొనియాడారు. ఆయన మరణం పార్టీకి, ఉద్యమానికి తీరని లోటు అన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని పిలుపునిచ్చారు. సాధారణ మధ్యతరగతి కుటుంబంలో జన్మించి టైలర్ వృత్తి చేసుకుంటూ అంచెలంచెలుగా కమ్యూనిస్టు యోధుడిగా మారిన వైనం నేటి కమ్యూనిస్టులందరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. దేశంలో కార్మిక, వ్యవసాయ కార్మిక, రైతాంగ, యువజన పోరాటాలకు శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. ఎన్నో ప్రజా పోరాటాల్లో కీలక భూమిక పోషించారన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎస్కె.వలి, డోకల రవితేజ, బివి.వర్మ, బొడ్డుపల్లి రాంబాబు, సందక సూరిబాబు, గేదెల రాము, పాలేపు రమణమ్మ, సోర్ల రంగమ్మ పాల్గొన్నారు.

భీమవరం టౌన్లో..

మొగల్లులో స్వచ్ఛ సర్వేక్షణ్ కేంద్ర బృందం పర్యటన

ప్రజాశక్తి - పాలకోడేరు

మొగల్లు గ్రామంలో స్వచ్ఛ సర్వేక్షణ్ కేంద్ర బృందం గురువారం పర్యటించింది. ఆలయాలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో పారిశుధ్య పరిస్థితి, మురుగునీరు పారుదల, పచ్చదనం వంటి అంశాలను పరిశీలించారు. అనంతరం కేంద్ర బృందం జిల్లా టీమ్ లీడర్ ఎం.మధుమతి గ్రామంలో వ్యక్తిగత గృహాలను సందర్శించారు. ప్రతి ఇంటికి మరుగుదొడ్డి ఉన్నదీ లేనిదీ, ఆ ఇంటి పరిసరాలు, ఇంటి ఆవరణలో ఏమైనా కూరగాయలు పండ్లు పెంచుతున్నారా లేదా అనే అంశాలను పరిశీలించారు. వాటితోపాటు గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం పనితీరు, తడి పొడి చెత్త విభజన, ప్లాస్టిక్ వ్యర్థాలను వేరు చేయడం, వర్మీ తయారుచేయడం అంశాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. స్వచ్ఛ సర్వేక్షణ్ బృంద సభ్యులు జి.రవి కిరణ్, ఎంపిడిఒ వి.రెడ్డియ్య, డిప్యూటీ ఎంపిడిఒ రాంప్రసాద్, పంచాయితీ కార్యదర్శి సుజాత, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్న పిహెచ్సి వైద్యులు

డెంగీపై అవగాహన

గణపవరం: డెంగీ మాసోత్సవాల సందర్భంగా గణపవరం ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామాల్లో డెంగీ వ్యాధిపై స్థానికులకు అవగాహన కల్పిస్తున్నట్లు గణపవరం వైద్యాధికారి కె.ఓంకార్ నాద్ అన్నారు. గురువారం డెంగీ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఓంకార్ నాద్ మాట్లాడుతూ దోమల వల్ల డెంగీ, చికిన్ గున్యా, మలేరియా వంటి వ్యాధులు వస్తాయన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. డెంగీ వ్యాధి నివారణ ఉత్తమరక్షణ అని తెలిపారు. గ్రామాల్లో డెంగీ వ్యాధి లక్షణాలు ఉన్నవారు దగ్గరలో ఉన్న హెచ్డబ్ల్యుసికి వ్యాధి నిర్ధారణ నిమిత్తం ఆశా కార్యకర్తలను పంపుతున్నామని చెప్పారు. వ్యాధి నివారణ కోసం మందులతో పాటు పరిసర ప్రాంతాల్లో ఏడిస్ సర్వే చేసి లార్వా ఉన్నట్లైయితే కీటక నియంత్రణ చేపడుతున్నట్లు చెప్పారు. దీనిలో భాగంగా ఆసుపత్రిని ప్రగతి పథంలో నడిపిస్తున్న కమ్యూనిటీ హెల్త్ అధికారి జాలాది విల్సన్ బాబు పుట్టినరోజు వేడుకలు ఆసుపత్రిలో ఘనంగా నిర్వహించారు. అనంతరం పూలమాల వేసి సన్మానించారు. వైద్యసిబ్బంది సత్యవతి, ఎం.బాలమురళీకృష్ణ, ఆశాజ్యోతి, లక్ష్మీ పద్మజ, ఎస్.యోహాన్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

రాష్ట్ర స్థాయి పోటీలకు మండపాక విద్యార్థులు

తణుకు : స్టెప్పింగ్ స్టోన్స్ ఇంగ్లీషు మీడియం స్కూల్ తేతలిలో గురువారం జరిగిన జిల్లా ట్రయతలాన్(రన్నింగ్, స్విమ్మింగ్, షూటింగ్) పోటీల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మండపాక విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చాటారు. అండర్-17 విభాగంలో ఎస్.గణేష్, అండర్-15 విభాగంలో కె.కిరణ్, ఎస్.రోహిత్, జి.రమేష్, అండర్-13 విభాగంలో జి.ఆనంద్ శ్రీనివాస్ అత్యుత్తమ ప్రతిభ చూపించి ఈనెల 26, 27 తేదీల్లో విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి ట్రయతలాన్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.ఫణిశ్రీ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను వారికి శిక్షణ ఇచ్చిన పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ సంకు సూర్యనారాయణను టిడిపి మండల అధ్యక్షులు ఆత్మకూరి రామకృష్ణ, గ్రామ సర్పంచి జానా వెంకటలక్ష్మీ, ఉప సర్పంచి జి.నగేష్, జనసేన నాయకులు అభినందించారు.

సచివాలయ ఉద్యోగుల సేవలు మరువలేనివి

బదిలీ ఉద్యోగులకు సన్మానం

ప్రజాశక్తి - ఉండి


తోలేరులో బదిలీ ఉద్యోగులను సత్కరిస్తున్న ఎంపిపి

గత ఐదు సంవత్సరాలుగా ప్రజలకు సచివాలయ ఉద్యోగులు అందించిన సేవలు మరువలేనివని వాంద్రం గ్రామ సర్పంచి, సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు దాసరి వెంకటకృష్ణ అన్నారు. మండలంలోని వాంద్రం గ్రామ సచివాలయంలో విధులు నిర్వర్తించి ఇటీవల జరిగిన బదిలీలలో బదిలీ అయిన ఉద్యోగులను సర్పంచి దాసరి వెంకటకృష్ణ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా దాసరి వెంకటకృష్ణ మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు ప్రజలకు కావాల్సిన సేవలను అందించారని అన్నారు. వారి సేవలను గుర్తించి బదిలీ అయిన ఉద్యోగులను సత్కరించడం తమ కనీస ధర్మమని అన్నారు. కొత్తగా చేరిన సచివాలయం ఉద్యోగులు వీరిని స్ఫూర్తిగా తీసుకుని తమ గ్రామ ప్రజలకు అవసరమైన సేవలందించాలని సూచించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ ఆధ్వర్యంలో సచివాలయ ఉద్యోగులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముదుండి శ్యామ్, మీసాల అప్పల కృష్ణ, పంచాయతీ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

వీరవాసరం : ఎక్కడికెళ్లినా ప్రతీ ఉద్యోగి ఆయా గ్రామాల ప్రజల మన్ననలు పొందే విధంగా వారి పనితీరు ఉండాలని ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని చంద్రశేఖర్ అన్నారు. తోలేరు సచివాలయం నుంచి బదిలీపై వెళ్లిన సచివాలయం ఉద్యోగులను గురువారం పంచాయితీ కార్యాలయంలో సత్కరించారు. సర్పంచి వేంద్ర వెంకటలీలాకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ సభలో ఆయన మాట్లాడుతూ కరోనా లాంటి విపత్కర పరిస్థితులలో సచివాలయం ఉద్యోగుల సేవలు మరవలేనివన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేయడంలో గ్రామస్తులకు వారు చేసిన కృషిని అభినందించారు. అనంతరం డి.అనితాకుమారి, ఎస్.జ్యోతిర్మయి, కె.సరస్వతి, జె.జ్యోతిలను ఘనంగా సత్కరించి మెమొంటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచి భోగిరెడ్డి శ్రీనివాసరావు, కార్యదర్శి ఎన్.ఫణీంద్ర, తోలేరు నీటి సంఘం అధ్యక్షులు యిర్రింకి బలరామూర్తి, గ్రామస్తులు, పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే లక్ష్యంగా పి-4

డిప్యూటీ ఎంపిడిఒ వెంకటరెడ్డి

ప్రజాశక్తి - ఉండి

పేదరిక నిర్మూలనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పి-4 కార్యక్రమం తీసుకొచ్చిందని మండల విస్తరణాధికారి, డిప్యూటీ ఎంపిడిఒ చల్ల సుదర్శన వెంకటరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని వాంద్రం గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎం.ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యాన పి-4 కార్యక్రమంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వెంకటరెడ్డి మాట్లాడుతూ స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్య సాధనలో భాగంగా పి-4 ప్రజల కోసం ప్రజలే సహాయం చేయడం అనే కార్యక్రమం కోసం గ్రామంలో ప్రభుత్వం ప్రతిపాదించిన అంశాల వారీగా నిరుపేదల జాబితాను తయారుచేసి, వారిని దత్తత తీసుకునేందుకు మార్గదర్శకులను గుర్తించి, ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. కొంతమందికి ఆర్థికంగానూ, మరికొంత మందికి చదువు విషయంలోనూ అవసరాలు ఉంటాయని, వాటిని గుర్తించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ సూచనలను అనుసరించి తమ గ్రామంలో చేసిన సర్వేలో బంగారు కుటుంబాలు లేవని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

కాలాన్ని మేల్కొల్పిన కవి గుర్రం జాషువా

కళారంజని నాటక పరిషత్ అధ్యక్షులు జవ్వాది శ్రీనివాస్

ప్రజాశక్తి - భీమవరం టౌన్

తెలుగు కవి గుర్రం జాషువా సమాజంలోని సామాజిక రుగ్మతలను తన కలంతో ఎదుర్కొన్నారని కళారంజని నాటక పరిషత్ అధ్యక్షులు జవ్వాది శ్రీనివాస్ అన్నారు. పట్టణ కళాకారుల సంఘం ఆధ్వర్యంలో గురువారం భీమవరం వెంకట్రామ థియేటర్ కాన్ఫరెన్స్ హాల్లో నవయుగ చక్రవర్తి పద్మభూషణ్ గుర్రం జాషువా వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ కాలాన్ని మేల్కొల్పిన కవి గుర్రం జాషువా అని, ఆయన రచనలతో సమాజంలో చైతన్యం తీసుకొచ్చారని అన్నారు. కళాకారుల సంఘం కన్వీనర్ చెరుకువాడ రంగసాయి, అఖిల భారత శోభన్ బాబు సేవా సమితి అధ్యక్షుడు భట్టిప్రోలు శ్రీనివాసరావు మాట్లాడుతూ సాహిత్యం నేటి యువతరానికి ఎంతో అవసరమని, జాషువా సాహిత్యం విశ్వజనీనమైనదని, జాషువా సాహిత్యం పండితులకు, పామరులకు సరళంగా అర్థమయ్యేలా ఉంటుందని కొనియాడారు. గబ్బిలం, కాందిశీకుడు, బాపూజీ, నేతాజీ, ముంతాజ్ మహల్, ఫిరదౌసి వంటి కావ్యాలతో జాషువా తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేశారన్నారు. కార్యక్రమంలో ప్రజానాట్య మండలి జిల్లా నాయకులు మల్లుల సీతారామ్ ప్రసాద్, ఎస్కె.చాన్ భాషా పాల్గొన్నారు.

పలుచోట్ల 'సుపరిపాలనలో తొలిఅడుగు'

ప్రజాశక్తి - ఇరగవరం

గత ప్రభుత్వంలో ఇళ్ల స్థలాలు ఇస్తామని లబ్ధిదారుల నుంచి వైసిపి నాయకులు పెద్ద ఎత్తున డబ్బులు వసూలు చేశారని తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ ఆరోపించారు. గురువారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇరగవరం మండలం అయితంపూడి, పేకేరు గ్రామాల్లో పర్యటించిన ఆయన ఇంటింటికీ వెళ్లి గత ఏడాది కాలంగా అందుతున్న సంక్షేమం, అభివృద్ధి గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ ఇచ్చిన స్థలాలు సైతం ఎందుకు పనికి రాకుండా కనీసం ఇళ్లు కట్టుకోలేని పరిస్థితులు ఉన్నాయని లబ్ధిదారులు తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. కమిషన్ల కోసం ధనార్జనే ధ్యేయంగా అన్యాయంగా వారికి ఇళ్ల స్థలాలు కేటాయించారని అన్నారు. అర్హులైన లబ్ధిదారులకు రాబోయే రోజుల్లో పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు అందజేయాలని ఇప్పటికే చంద్రబాబునాయుడు నిర్ణయం తీసుకున్నారని, ఇందుకు సంబంధించి లబ్ధిదారుల జాబితాలను తయారు చేస్తున్నామన్నారు. సంక్షేమాన్ని ప్రణాళిక ప్రకారం అమలు చేయడానికి సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. అయితంపూడి, పేకేరు గ్రామాలో అభివృద్ధి కార్యక్రమాలను సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం చేపట్టామన్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు ఎంఎల్ఎ తెలియజేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఉండి : కరపత్రాలను పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

ఉండి : రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలకు కట్టుబడి పనిచేస్తుందని, ప్రతి ఒక్కరూ ప్రభుత్వానికి మద్దతుగా నిలబడాలని టిడిపి మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు అన్నారు. మండలంలోని యండగండి గ్రామ అధ్యక్షులు మంతెన రవివర్మ(వేణు) ఆధ్వర్యాన స్థానిక ఎంఎల్ఎ, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు ఆదేశాల మేరకు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాగరాజు, క్లస్టర్ ఇన్ఛార్జి పొత్తూరి ప్రసాద్ రాజు మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం పాలన సాగిస్తుందన్నారు. ప్రభుత్వంపై ఆధారపడకుండా దాతల భాగస్వామ్యంతో స్థానిక ఎంఎల్ఎ కనుమూరి రఘురామకృష్ణరాజు మురుగు పంట కాలువల ప్రక్షాళన చేయించి రైతుల అభివృద్ధికి తోడ్పాటు ఇచ్చారని అన్నారు. గ్రామంలోని సమస్యలను పరిష్కరించేందుకు స్థానిక ఎంఎల్ఎ సహకారంతో తన వంతు కృషిచేస్తానని మంతెన రవివర్మ అన్నారు. గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి గత ఏడాదిలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలను అందించి నూటికి నూరు శాతం పూర్తిచేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మాదాసి అజయ్, కల్లేపల్లి సతీష్ రాజు, తక్కెళ్ల నరేష్ పాల్గొన్నారు.

నరసాపురం : టిడిపి ఇన్ఛార్జి పొత్తూరి రామరాజు ఆధ్వర్యాన నరసాపురం పట్టణంలోని 29వ వార్డు 45వ బూత్ అరుంధతి పేటలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రామరాజు ప్రతి ఇంటికి తిరిగి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యకారుల సహకార సంఘాల సమాఖ్య ఛైర్మన్ కొల్లు పెద్దిరాజు, మాజీ ఎఎంసి ఛైర్మన్ కొప్పాడ రవీంద్రనాథ్ ఠాగూర్, 31వ వార్డు కౌన్సిలర్ పాలూరి నరసింహారావు(బాబ్జీ), చెట్టుం ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆదాయపు పన్నుపై అవగాహన

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం డిగ్రీ కాలేజీలో గురువారం జాతీయ ఆదాయం పన్ను దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపల్ పి.నిర్మలాకుమారి అధ్యక్షత వహించారు. ఆన్లైన్లో గెస్ట్ లెక్చరర్ ఉత్తమ సాగర్ మాట్లాడుతూ ఇన్కం ట్యాక్స్ ఇంపార్టెన్స్, ఐటిఆర్ఇ ఫిల్లింగ్ ఫారం 16పై విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ రకాల క్విజ్ పోటీలు, వ్యాసరచనలు పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. వైస్ ప్రిన్సిపల్ కె.స్వరూపరాణి, కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్ : ఉల్లంపర్రు మాంటిస్సోరిస్ స్కూల్ విద్యార్థులకు ఇన్కమ్ టాక్స్ డే సందర్భంగా వారికి టాక్స్ విధానంపై ముఖ్యఅతిథిగా విచ్చేసినటువంటి ఇన్కమ్ టాక్స్ ఆఫీసర్ ఎన్. సూర్యనారాయణ సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు టాక్స్ ఎందుకు కట్టాలి? టాక్స్ కట్టడం వల్ల కలిగే ప్రయోజనాలు, టాక్స్ విధానం వల్ల ఏవిధంగా దేశం అభివృద్ధి చెందుతుంది అనేదానిపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు దానిపై ఒక పరీక్ష కూడా నిర్వహించారు. దీనిలో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాలకొల్లు ఇన్కమ్ టాక్స్ ఇన్స్పెక్టర్ కె.గిరీష్, కె.అశ్విన్, మాంటిస్సోరిస్ విద్యాసంస్థల ఛైర్మన్ మద్దాల రాంప్రసాద్, డైరెక్టర్, అడ్మినిస్ట్రేటర్ మద్దాల వాసు, ఆడిటర్ శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.

అన్న సమారాధన

ప్రజాశక్తి - మొగల్తూరు

మండల కేంద్రం మొగల్తూరులోని కోట రోడ్డులో ఉన్న దత్తసాయి మందిరంలో గురువారం అన్న సమారాధన చేశారు. దత్త సాయి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన అన్న సమారాధనలో అధిక సంఖ్యలో యాత్రికులు పాల్గొన్నారు. సమారాధనలో పాల్గొన్న ప్రజలకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

సిఎం సహాయ నిధి అందజేత

ప్రజాశక్తి - పోడూరు

ఆచంట నియోజకవర్గంలో దారిద్ర్య రేఖ దిగువనున్న పేదలకు సంబంధించి అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందిన 91 మంది బాధితులకు ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ రూ.43 లక్షల 2 వేల 93 నగదు విలువ గల చెక్కులను కొమ్ముచిక్కాల ఎంఎల్ఎ కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, మండల, గ్రామ అధ్యక్షులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ అదనపు సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) ఏలూరు, ఏలూరు జిల్లా.

I.A.No.919/24 in O.S.No.411/2017

బిట్వీన్ :
దాసరి వెంకటేశ్వరరావు & 14 వగైరా ...Petitioners
And
ముల్పూరి శ్రీకృష్ణ వాసుదేవ వరప్రసాదరావు & 21 వగైరా ...Respondent

R1: ముల్పూరి శ్రీక్రిష్ణ వాసుదేవ వరప్రసాదరావు, S/o.బాలశంకరరావు, R/o.D.No.3-136-6-37, ఏపూరు (V), పెదపాడు, (M) ఏలూరు జిల్లా,

కోర్టు ప్రకటన

పై నంబరు దావాలోని IA ను Decree Amandment చేయమని కోరుచూ దాఖలు చేసిన పై నంబరు IA లో 1వ ప్రతివాదికి ఎన్నిసార్లు కోర్టు వారు నోటీసులు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీకోర్టు వారు నోటీసులు అమలు నిమిత్తం పేపరు పబ్లికేషన్ ఆర్డర్ వేసినారు. పై నెంబర్ IAలో 1వ ప్రతివాదికి ఏమైన అభ్యంతరము ఉన్నయెడల ది.**12-08-2025**వ తేది ఉదయం గం.10.30 ని॥లకు పైకోర్టు వారి ఎదుట స్వయంగా గాని ప్లీడరు గారి ద్వారా గాని ఆక్షేపణలు తెలియచేసుకోవలెను. లేనియడల మీకు పరోక్షముగా ఆర్డరు పాస్ చేయబడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

Sri D.Prabhakar,
Eluru — Advocate, Eluru.
Dt.23-07-25 — Cell: 9440184345

ప్రకటన

మహారాజశ్రీ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో, నరసాపురం, ప.గో.జిల్లా

ఇ.పి.నెం.5/2020 ఇన్ ఓ.యస్.నెం.249/2014

బిట్వీన్ :
బొప్పాడి సుబ్బారావు ...పిటీషనర్/DHR
మరియు
శలా బసవ కోట శంకరయ్య ...రెస్పాండెంట్/JDR

సమన్స్ టు :
రెస్పాండెంట్/JDR : శలా బసవ కోట శంకరయ్య, S/o.బసవ కోటయ్య, పురుషుడు, వయస్సు 55 సం.రం., బిజినెస్, దగ్గులూరు, పాలకొల్లు మండలం, పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్ర ప్రదేశ్.

పై నెంబరు గల ఇ.పిలో DHR కి మీ నుంచి రావలసిన డిక్రీ బాకీ నిమిత్తం మీకు చెందిన పై నెంబరు ఇ.పి షెడ్యూల్ ఆస్థిని వేలం వేయుట ద్వారా బాకీని వసూలు ఇప్పించమని కోరుతున్నందున సదరు ఇ.పి.లో శ్రీ కోర్టు వారు మీకు ఎన్నిసార్లు రిజిష్టర్ పోస్ట్ ద్వారాను, మరియు శ్రీ కోర్టు వారి ద్వారాను రూల్ 64 సేల్ నోటీసులు పంపించినప్పటికి ఇ.పి నోటీసులు మీరు తీసుకోకుండా కాలయాపన చేస్తునందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా **ది.06-08-2025** సం.తేదీన ఉదయం 10:30 నిమిషములకు మీరు స్వయంగా గాని, ప్లీడర్ గారి ద్వారా గాని, కోర్టులో హాజరు అయి మీ ఆక్షేపణలను తెలియజేసుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున సదరు ఇ.పి విచారించబడి, తీర్మానించబడునని మీకు తెలియజేయుచున్నాము.

జి.పి.సుదర్శనరావు
పిటీషనర్ తరపున న్యాయవాది,
స్థలం : నరసాపురం — నరసాపురం
తేదీ : 25-07-2025 — సెల్: 9985649898

డాక్యుమెంట్లు పడిపోయినవి

గుండుమోగుల శివకుమార్, తండ్రి: వీర వరప్రసాద్, 1-62, తోకలపూడి, వీరవాసరం మండలం, పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్ర ప్రదేశ్ - 534247 నివాసి అయిన నేను 2025 జూలై 23న తోకలపూడి నుండి వీరవాసరం వెళ్తూ, నా వద్ద ఉన్న ఆస్తి పత్రాలు ఉన్న ఒక కవర్ను మోటార్ సైకిల్పై వీరవాసరానికి జిరాక్స్ కోసం తీసుకెళ్తున్న సమయంలో కోల్పోయాను. ఆ కవర్లో ఉన్న పత్రాలు 1) 12-03-2020 తేదీతో డాక్యుమెంట్ నెం.866, అంబాజిపేట ఎస్.ఆర్.వో.లో రిజిస్ట్రేషన్ అయిన అసలు విభజన పత్రం (పార్టిషన్ డీడ్) 2) 12-04-2021 తేదీతో డాక్యుమెంట్ నెం.1265, వీరవాసరం ఎస్.ఆర్.వో.లో రిజిస్ట్రేషన్ అయిన అసలు రిజిస్టర్డ్ సేల్ కమ్ జి.పి.ఎ. పత్రం. పై రెండు అసలు పత్రాలు ఎవరికైనా దొరికినట్లయితే, దయచేసి నన్ను సంప్రదించి నా వద్దకు అందజేయగలరు.

ఆస్తి వివరాలు

వీరవాసరం ఎస్.ఆర్.వో. పరిధిలోని తోకలపూడి గ్రామం, సర్వే నం. 76-ఎ లో 227.67 చదరపు గజాలలో ఉన్న డోర్ నెం.1-62రు ఆర్.సి.సి. ఇల్లు. **ఇల్లు సరిహద్దులు : ఉత్తరం:** నీటి కాలువ, **దక్షిణం:** గన్నబత్తుల స్వప్న గారి ఇల్లు, **పడమర:** రోడ్డు, **తూర్పు:** గుండుమోగుల శ్రీహరి సంబంధిత స్థలం (ఇల్లు సహా).

గుండుమోగుల శివకుమార్,
S/o వీర వరప్రసాద్, డోర్నెం.:1-62, తోకలపూడి,
వీరవాసరం మండలం, పశ్చిమ గోదావరి జిల్లా, సెల్: :6362557224